రచన - ఆగస్ట్, 1996

"ఆమె గాయని అయితే శిలలను కరిగించి ఉండేది. నాయకి అయితే విప్లవాలను తెచ్చి ఉండేది. అత్తగారై పోయింది. తన శక్తిని కోడలిపై ప్రయోగిస్తోంది-"

# అత్తా ఒకింటి కోడలే

"ఒసే రమా - ఇంకా ఆ బట్టలుతకడం అవలేదటే? ఏమిటే బాబూ - ఇంత నెమ్మది! నేను చేశానంటే పది నిముషాలు కూడా పట్టదు. మీ అమ్మ నెమ్మది కాబోలు - నీకూ అదే నేర్పింది...." అంది లక్ష్మీకాంతమ్మ.

బదులివ్వలేని బండరాతిలో కూడా చలనం సృష్టించి, ఆవేశం నింపి - ఎదిరించే స్థాయికి తీసుకురాగల శక్తినావిడ సంప్రదాయంలోంచి - చెట్లు భూమిలోంచీ సారాన్ని పట్టుకుని పూలూ, పళ్ళూ చేసేటంత సహజంగా - గ్రహించుకుంది. గాయని అయితే శిలలను కరిగించి ఉండేది. నాయకి అయితే విప్లవాలను తెచ్చి ఉండేది. అత్తగారై ఊరుకుంది. కోడళ్ళ మీద పుంజుకుంది.

ఆవిడ పేరు లక్ష్మీకాంతమ్మే అయినా అందరూ కాంతమ్మగారంటారు. ఎప్పుడో కోడళ్ళొస్తారనేమో ఆవిడ భర్త మీద ప్రాక్టీసు ప్రారంభించింది. భర్త పొదుపరి. వృత్తి రీత్యా లాయరు. తన వాదనా పటిమ నాయన కోర్టుకోసం పొదుపు చేసేవాడు. కోర్టులో విషనాగులా బుసలు కొట్టే ఆయన నాలుకను చూసి ప్రత్యర్థులు గడగడ వణికేవారు. ఇంట్లో మాత్రం తల్లి నోట్లో నాలుకలేనివాడని కొడుకును చూసి జాలిపడేది.

సాధారణంగా తల్లులకు కొడుకుల అమాయకత్వం పెళ్ళయ్యాకే తెలుస్తుంది. కాంతమ్మ అత్తగారి విషయంలోనూ అదే జరిగింది. కోడలు కొడుకును బాధపెట్టకుండా ఆవిడ జాగ్రత్త పడింది. ఇంటి పనంతా కోడలు చేత చేయించేది. అన్ని పనుల్లోనూ వంకలు పెట్టేది. కోడలి పుట్టింటి వారిని ఆడిపోసేది. కోడల్ని పుట్టింటికి తోలేయగలనని బెదిరించేది.

కాంతమ్మకు కోపం, ఉక్రోషం కలగలుపుగా వచ్చేవి. రాత్రిపూట భర్తకు ఫిర్యాదు చేసుకుంటే ఆయన, "చేతనైతే మా అమ్మ నెదిరించు. నేను జోక్యం చేసుకోను" అని హామీ యిచ్చాడు. కానీ అత్తాకోడళ్ళలో ఒకరు మాత్రమే గయ్యాళి కాగలరన్నమాట

నిజం. అత్తగారినేమీ అనలేని కాంతమ్మ భార్యాభర్తల్లోనూ ఒక్కరే గయ్యాళి కాకపోరులే అని ప్రాక్టీసు ప్రారంభించింది. అత్తగారు బ్రతికున్నంతకాలం ఆ ప్రాక్టీసు రహస్యంగా కొనసాగింది. అత్తగారు పోయాక – తల్లిపోయినందుకు భర్త ప్రతిరోజూ కుమిలి కుమిలి ఏడ్చేటంతగా – ఆ ప్రాక్టీసు వృద్ధిచెందింది. ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడు పెళ్ళికాగానే వేరు కాపురం పెట్టాడు – ఆఫీసుకు దగ్గర్లో ఉండాలనే వంకతో. రెండోది ఆడపిల్ల. పెళ్ళై అత్తవారింటికి వెళ్ళింది. ఇక మిగిలింది శేఖర్. అతడికిలా ఉద్యోగం రాగానే అలా తండ్రి పోయాడు.

కాంతమ్మకు పెద్దకోడలి దగ్గరుండాలనుంది. కానీ ఒంటరివాడైన శేఖర్‌కు తల్లి అవసరముంది. ఆవిడ అతడి దగ్గరే ఉంటూ పెళ్ళిచేసుకోమని పోరేది. మనసులో పెళ్ళి చేసుకోవాలని ఉన్నా తల్లి విషయం తెలిసిన వాడై అసలు విషయం ఎలా చెప్పాలో తెలియక, “నాకు పెళ్ళైతే నువ్వు దూరమౌతావు” అన్నాడు శేఖర్. అప్పుడు కాంతమ్మ కలకాలం చిన్న కొడుకు దగ్గరే ఉంటానని హామీ యిచ్చి అతగాణ్ణి మరింత హడలగొట్టింది. అతడు పెళ్ళికి ససేమిరా అన్నాడు. కానీ ఆడపిల్లల్ని కన్నెచెర వదిలించడానికి మాత్రమే కన్నామనుకునే తల్లిదండ్రులూరుకుంటారా? అటువాళ్ళు – ఇటు కన్నతల్లి – శేఖర్ ఒత్తిడికి లొంగాడు. రమను పెళ్ళిచేసుకున్నాడు.

మాట వరసక్కూడా పెద్దకొడుకు తల్లిని తన వద్ద వచ్చి ఉండమనలేదు. అయినా చిన్నకొడుకు తల్లి వెళ్ళిపోతుందని మాటవరుసకు భయపడ్డాడు. అప్పుడు కాంతమ్మ, “రమ చిన్నపిల్ల. పనులన్నీ దగ్గరుండి నేర్పుతాను – ఓ రెణ్ణెల్లిక్కడా, ఓ రెణ్ణెల్లక్కడా ఉంటాను–” అంది. అప్పుడు కూతురు తన విషయం గుర్తుచేసింది. మన సంప్రదాయంలో అదే విశేషం. పెళ్ళయ్యాక కొడుకులు తల్లిని వదుల్చుకోవాలనుకుంటారు. కూతురు తల్లికోసం దేవుళ్ళాడుతుంది. అపోజిషను వాళ్ళ ప్రజాసేవలా బాధ్యతలేని భక్తి ఆమెది! కాంతమ్మ కూతురి దగ్గరా కొన్నాళ్ళుంటానని మాటిచ్చింది. మాటిచ్చినప్పట్నించీ శేఖర్ రోజులు లెక్కపెట్టుకుంటున్నాడు. ఆర్నెల్లయింది. ఆవిడ ఇంకా అక్కడే ఉంది – “మీ అమ్మ నెమ్మది కాబోలు – నీకూ అదే నేర్పింది” – లాంటి డైలాగులు నిత్యకృత్యంగా వదులుతూ.

వియ్యపురాలు నేర్పిన వాటిగురించి బాధపడే కాంతమ్మ కోడలికి నేర్పిందీ లేదు. ఆవిడ వంటింట్లోకి అడుగే పెట్టదు. అందుకావిడకి టైమేదీ....

కాంతమ్మ గారిది తిట్టే నోరే కాదు – తిరిగే కాలు కూడానూ! ఆవిడ యింట్లో ఉండేది – టీవీలో తెలుగు సినిమాకి కాక భోజనం, నిద్రకోసం – అంతే! మిగతా టైమంతా పేత్తనాలు. పేత్తనాల్లో ఆవిడ ప్రవర్తన వేరే రకంగా ఉంటుంది. అవతల వారికయిష్టులైనవారి మీద చాడీలు చెబుతుంది. అంతే – ఆవిడ రాక వాళ్ళందరికీ ఆకర్షణ! ఆ ఆకర్షణను పెంచుకుందుకు ఆవిడ వాళ్ళను విపరీతంగా పొగుడుతూంటుంది. ఆవిడకు పొగడ్డం వచ్చుననడానికి వాళ్ళు మాత్రమే సాక్షులు!

ఇంట్లో ఉన్న ఆ కాసేపూ – టీవీ చూస్తున్నా, భోజనం చేస్తున్నా, నిద్రకు

అవులిస్తున్నా - పెద్దకోడలినో, చిన్నకోడలినో అలా తిడుతూనే ఉంటుందావిడ.

మొదట్లో రెండు నెలలపాటు రమ అత్తగారి మాటలకు చాలా బాధపడింది. ఒకసారి తోటికోడలింటికి వెళ్ళి చెప్పుకుంది. ఆమె నవ్వి, "అంటరానితనం పాటించే వాళ్ళంతా చెడ్డవాళ్ళు కారు. సంప్రదాయం మహిమ - అదంతా! మన అత్తగారు మాటలంటుంది కానీ మనకు అపకారం చేయదు. కొడుకునీ కోడల్నీ విడదియ్యదు. మన బట్టలు మనని కొనుక్కోనిస్తుంది. మన ఖర్చులు మనని పెట్టుకోనిస్తుంది. మాటలు పట్టించుకోకుండా ఉండగలిగితే చాలు - మన జీవితం స్వర్గం. నాకు చేతకాలేదు - వదుల్చుకున్నాను. నీకు తప్పదు - అలవాటు చేసుకో!" అని సలహా యిచ్చింది. ఆ మాటల్లో నిజముందని రమకు అనిపించింది. ఒకటి రెండుసార్లు భర్తకు చెప్పింది - "పొద్దున ఎనిమిదింటికి నా ఆఫీసు. రాత్రి తొమ్మిదికి ఇంటికొస్తాను. ఈ అలసటంతా నిన్నుచూసి మర్చిపోతాను. మళ్ళీ అలసటను గుర్తుచేసే కబుర్లు వద్దు. ఎలాగో అలా సర్దుకుపోలేవా?" అన్నాడతడు. అది అవకాశవాదమే కావచ్చు. కానీ అందరాడవాళ్ళకు లాగే ఆమె ఆ అర్థింపుకు లొంగిపోయింది.

స్వతహాగా రమకు బయట తిరగడం నచ్చదు. చదువుకునే రోజుల్లో తీరుబడి ఉన్నప్పుడు మంచి పుస్తకాలు చదివేది. అత్తగారి బారినుండి తప్పించుకుందుకిప్పుడామె బ్యాంకు పరీక్షలక్కూడా ప్రిపేరవుతోంది కానీ ఏకాగ్రత కుదరడం కష్టంగా ఉంటోంది. డిగ్రీ అవగానే పెళ్ళికావడం వల్ల అమ్మలక్కలతో కలవడం, మాట్లాడ్డం ఇంకా అలవాటు కాలేదు. కానీ పక్కింటి మీనాక్షితో మాత్రం బాగా స్నేహం కలిసింది.

మీనాక్షి, రమలది ఇంచుమించు ఒకే వయసు. ఇంచుమించుగా ఒకేసారి పెళ్ళై ఒకేసారి కాపురానికి వచ్చారు. ఎటొచ్చీ మీనాక్షికి అత్తగారి బెడదలేదు. మొగుడు, పెళ్ళాం - ఇద్దరే ఉంటున్నారు. అందుకని మీనాక్షి కొత్తలో తరచుగా రమ యింటికి వచ్చేది. కోడలికి ఆప్తురాలవుతోందని కనిపెట్టిన కాంతమ్మ మీనాక్షికి అత్తగారు లేని లోటు తీర్చే ప్రయత్నం చేయబోగా - మీనాక్షి ఆవిడుండగా వాళ్ళింటికి రావడం మానేసింది. అయినా వాళ్ళు కలుసుకుందుకు పెద్ద యిబ్బందేమీ లేదు. తరచుగా కాంతమ్మ బయట తిరుగుతూనే ఉంటుంది కదా! అందుకే వారి స్నేహం దినదిన ప్రవర్ధమానమై 'మీరు' నుంచి 'నువ్వు'లోకీ - స్నేహం నుంచి అక్కా చెల్లెళ్ళ బంధుత్వంలోకీ - కబుర్లునుంచి కష్టసుఖాల ఎక్స్‌చేంజికీ మారింది.

ఇద్దరిళ్ళకీ మధ్య ఓ అడ్డుగోడ ఉంది. గోడకు చెవుల్లేవు కానీ చెవులున్నవారి కటూ యిటూ మాటలు వినిపిస్తుంటాయి. దానికి తోడు కాంతమ్మగొంతు చిన్నది కాదు. అందుకని రమ చెప్పకుండానే మీనాక్షికి చాలా విశేషాలు తెలుస్తూండేవి. అందుకే తరచుగా ఆమె, "నువ్వు కాబట్టి ఆరు నెలల్లో ఒక్కసారి కూడా మీ అత్తగారి మాటకెదురు చెప్పలేదు. అదే నేనైతేనా - ఈపాటి కావిడో, నేనో తేల్చేసేదాన్ని" అనేది రమతో.

రమకు మాటలు పడడం కొత్తకాదు. తనింట్లో తల్లికూడా ఆడపిల్లని చేసి అప్పుడప్పుడు గట్టిగా దెబ్బలాడేది. తనూ ఊరుకోకుండా ఎదురు సమాధానం చెప్పేది.

తండ్రి తనని సపోర్టు చేసేవాడు. అక్కడ అప్పుడప్పుడు జరిగేది ఇక్కడ రోజూ జరుగుతోంది. తనకు సపోర్టు లేదు. ఎదురు సమాధానం చెప్పకుండా సహించాలి. సహించడం కష్టం కాదు - కానీ అత్తగారిలో తల్లిని చూడాలని ప్రయత్నిస్తోంది రమ. తల్లి అప్పుడప్పుడత్తగారిలా ప్రవర్తించినట్లే - అత్తగారు కూడా అప్పుడప్పుడు తల్లిలా ప్రవర్తించే శుభఘడియలకోసం ఆమె ఎదురుచూస్తోంది.

"మీ అమ్మనెమ్మది కాబోలు - నీకూ అదే నేర్పింది" అన్న మాట మాత్రం ఎన్నిసార్లు విన్నా అలవాటు కావడంలేదు రమకు. ఆ రోజు కాంతమ్మ అదే మాట అని పెత్తనాలకు వెళ్ళాక - వచ్చిన మీనాక్షితో, "నా సహనానికి అంతం వస్తోంది. అయిన దానికీ కానిదానికీ ఆవిడ మా అమ్మని లాగడం నా రక్తాన్ని మరిగిస్తోంది. కానీ ఎదిరిస్తే ఏం ప్రయోజనం? రోజూ ఆయనింటికి రాగానే తన పెత్తనాల కబుర్లు చెబుతూ మమ్మల్నిద్దర్నీ ఓ పట్టాన మాట్లాడుకోనివ్వరావిడ. మాకు గొడవయిందంటే అదీ చెబుతారు. అప్పుడు నేనూ మాట్లాడాలి. ఆయనకు మనశ్శాంతి ఉండదు. కానీ నాలో అగ్నిపర్వతం ఏదో ఒక రోజున బద్దలవుతుంది. మా అత్తగారిని మార్చడానికో మంచి ఉపాయమా లోచించు" - అంది రమ.

రమ సమస్య మీనాక్షిని కదిలించింది. వారం రోజులు తీవ్రంగా ఆలోచించింది. చివరకు ఏదో తట్టింది. ఒక రోజామె రమతో, "మీ అత్తగారికి సినిమా పిచ్చి ఉంది. మనం అద్దెకు వీసీపీ తెచ్చుకుందాం. నాలుగిళ్ళ వాళ్ళం ఖర్చులు పంచుకుందాం. అత్తగారు కోడల్ని అష్టకష్టాలూ పెట్టి తన తప్పులు తెలుసుకుంటుంది కదా - వరసగా అలాంటి సినిమాలు చూపిద్దాం. ఓ అరడజను సినిమాలు చూసేసరికి మీ అత్తగారిలో మార్పు వచ్చి తీరాలి" అంది.

ఈ అయిడియా రమకు నచ్చింది. రాత్రి భర్తకు యథాతథంగా విషయం చెప్పింది.

శేఖర్‌కు భార్యమీద చెప్పలేనంత జాలిపుట్టింది. కానీ ఏం చేస్తాడు? అతడు తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. రమ ఓర్పుని మెచ్చుకుంటే తల్లికూడా మెచ్చుకుని, "అందుకే కదా - నేనిక్కడే ఉంటున్నా - లేకుంటే ఎప్పుడో పెద్దాడి దగ్గరకు పోయేదాన్ని" అంది అదో ఫావర్‌లా. సెలవు రోజువస్తే బయటకు వెళ్ళాలంటే తమతో అత్తగార్నీ రమ్మంటుంది రమ. కొడుకా విషయం చెబితే, "నేను దాన్ని కన్నకూతుర్లా చూసుకోవడం వల్ల దానికి నేను కన్నతల్లిలా కనబడుతున్నాను. నన్నొదిలి ఉండలేదు" అంది గొప్పగా. సూటిగా చెప్పే మనస్తత్వం కాదు శేఖర్‌ది.

భార్య వీసీపీ గురించి చెప్పగానే, "నీ అయిడియా నీ మనసంత బాగుంది. ఆఫీసులో నా ఫ్రెండొకడికి ఫారిన్ ఛాన్సు వచ్చింది. తన వీసీపీ మంచి కండిషన్లో ఉంది - అయిదువేలకిస్తానన్నాడు. నీకు చెబుదామనుకుని మర్చిపోయాను. అద్దెకు తెచ్చుకోవడమెందుకు - అదే కొందాం - ఆ మాత్రం డబ్బుంది నా దగ్గర -" అన్నాడు శేఖర్.

భర్త అవగాహనకు రమ ఎంత సంతోషించిందో - ఆమె సంతోషం తనకెంత

సుఖానిస్తుందో ఆ రాత్రి శేఖర్ మరోసారి తెలుసుకున్నాడు.

రెండు రోజుల్లో వీసీపీ వచ్చింది. ప్రారంభోత్సవం "అత్తా ఒకింటి కోడలే" చిత్రంతో. అందులో విశ్వరూపం చూపించింది మహానటి సూర్యకాంతం.

రమ, శేఖర్, కాంతమ్మ - ముగ్గురూ చూశారా సినిమా! కాంతమ్మ సినిమాను ఏకాగ్రతతో చూస్తోంది. శేఖర్, రమ ఆవిణ్ణి ఏకాగ్రతతో చూస్తున్నారు.

కాంతమ్మ సినిమాలో లీనమైపోయింది. కోడలు కష్టపడుతున్నపుడల్లా ఆవిడ వేడి నిట్టూర్పులు విడుస్తోంది. అత్తగారు కనపడినపుడల్లా పళ్ళు పిండుతూ శాపనార్థాలు పెడుతోంది. ఆవిడ హృదయమెంతగా కదిలిపోయిందో ఏమో తరచుగా కన్నీళ్ళొత్తుకుంది.

మామూలు సినిమాల్లో మధ్య మధ్యన కోడల్ని చిన్నబుచ్చే మాటలనే కాంతమ్మ ఈ రోజు సినిమా చూస్తూ పల్లెత్తుమాట అనలేదు. అదే గొప్ప విశేషంగా భావించిన శేఖర్ సినిమా అయిపోగానే "ఎలా ఉందమ్మా?" అనడిగాడు.

"చిన్నప్పుడు చూసిందే కానీ - గుర్తు లేదు. చాలా బాగుందిరా! చూస్తున్నంతసేపూ మీ బామ్మ నన్ను పెట్టిన కష్టాలే గుర్తుకొచ్చాయనుకో - ఆ కోడలు కూడా నాలాంటిదే! నోరెత్తకుండా అన్నీ భరించింది. అందుకే అత్తకి తగిన శాస్తి జరిగిందిలే - బాగా అయింది" అని చిన్నపిల్లలా సంతోషపడిందావిడ.

శేఖర్, రమ ముఖాముఖాలు చూసుకున్నారు.

ఆ సినిమా ఆవిణ్ణి గతంలోకి తీసుకువెళ్ళింది. గతాన్నీ, వర్తమానాన్ని, భవిష్యత్తునీ ఒకదానితో ఒకటి కలపక విడివిడిగా చూసే సంప్రదాయం మనది!

ఆ చిత్రంలో రమకు రమ కోడలు. కాంతమ్మకు కాంతమ్మ కోడలు, రమకు కాంతమ్మ అత్తగారు కావచ్చు కానీ ఆ అత్తా ఒకింటి కోడలే కదా! రమ మీనాక్షినింకో ఉపాయమడగాలనుకుంది.

✦ ✦ ✦